

## విలేఖరులకు ఆహ్వానం

వరంగల్ వాయిస్ సాయంకాలం దినపత్రిలో పనిచేయుటకు ఆసక్తి కలిగిన విలేఖరులు, అడ్వటైజ్ మెంట్ ఏజెంట్లకు యాజమాన్యం స్వాగతం పలుకుతోంది. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల స్టాఫ్ రిపోర్టర్లతోపాటు నర్సంపేట, కాటారం, మరిపెడ, క్రైం, ఎంజీఎం, గ్రేన్ మార్కెట్, వరంగల్ కలెక్టరేట్, హనుమకొండ కలెక్టరేట్, స్టేషన్ ఘనపూర్ పరిధిలో పనిచేయుటకు ఆసక్తి కలిగిన వారు సెల్ నెంబర్ 99891 24061, 98499 43339 లలో సంప్రదించగలరు. - వరంగల్ వాయిస్ యాజమాన్యం


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 336
పేజీలు : 08 | వెల: రూ.5/-

శుక్రవారం
అక్టోబర్ 24, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# తేజస్వీలో.. ఏం జరుగుతోంది?

హనుమకొండ జిల్లా కేంద్రం నయీంనగర్ లోని తేజస్వీ స్కూల్ లో మరో విద్యార్థి అనుమానాస్పదంగా మృత్యువాత పడడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. సరిగ్గా నెల పదిహేను రోజుల క్రితం ఇదే పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థి ఆడుకుంటూ మృతి చెందిన ఘటన మరువకముందే గురువారం నాలుగో తరగతి చదువుతున్న గుండ్లసింగారానికి చెందిన విద్యార్థి బానోతు సుజిత్ ప్రేమ్ (9) మృతి చెందడం ఆందోళనకు గురిచేస్తోంది. ఎప్పటి నుంచో పాఠశాల యాజమాన్యంపై విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారన్న తీవ్ర ఆరోపణలున్నాయి. దీనికితోడు అధిక ఫీజుల వసూలుతో విద్యార్థులు కుంగిపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేవలం రెండు నెలల వ్యవధిలో రెండు మరణాల నేపథ్యంలో పాఠశాలలో అసలు ఏం జరుగుతోందన్న ప్రశ్న తల్లిదండ్రులను, నగర ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. మా పిల్లల భద్రత ఎక్కడ అంటున్న పేరెంట్స్ ప్రశ్నలకు జవాబు దొరకడం లేదు. యాజమాన్యం తీరుపై అనేక ఆరోపణలు వస్తున్నా.. జిల్లా విద్యాశాఖ అధికారులు మౌనం వహించడంపై సవాలక్ష ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

–వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి

వివరాలు2లో..



- నెల రోజుల్లో ఇద్దరు మృతి
- వరుస మరణాలకు కారణాలేంటి
- తీవ్ర ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులు
- యాజమాన్యం తీరుపై విమర్శలు
- విద్యాశాఖ మౌనంపై అనుమానాలు



## పెండింగ్ ఫైళ్లు క్లియర్ చేయండి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- జిల్లా కలెక్టర్ తో ప్రత్యేక సమావేశం

8లో..



## వెచ్చవెచ్చగా.. చలి నుంచి రక్షణగా..

ఉలెన్ స్వెటర్ మార్కెట్ ప్రారంభించిన నాయిని




# తేజస్వీలో.. ఏం జరుగుతోంది..?




- నెల రోజుల్లో ఇద్దరు మృతి
- వరుస మరణాలకు కారణాలేంటి
- తీవ్ర ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులు
- యాజమాన్యం తీరుపై విమర్శలు
- విద్యాశాఖ మౌనంపై అనుమానాలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి :** హనుమకొండ నయీంనగర్‌లోని తేజస్వీ స్కూల్‌లో నెల రోజుల వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం నగరంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎప్పటి నుంచో ఈ పాఠశాల యాజమాన్యంపై అధిక ఫీజుల వసూలు, విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేయడం వంటి తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. తాజాగా గురువారం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి బానోతు సుజిత్ ప్రేమ్ (9) అనుమానాస్పదంగా మృతి చెందడం అందరినీ కలిచివేసింది. సరిగ్గా నెల పదిహేను రోజుల క్రితం ఇదే పాఠశాలలో చదువుతున్న మరో విద్యార్థి ఆడుకుంటూ గుండెపోటుతో మరణించిన ఘటన చోటుచేసుకుంది. రెండు మరణాల నేపథ్యంలో పాఠశాలలో అసలు ఏం జరుగుతోందన్న ప్రశ్న ఉద్భవిస్తోంది. విద్యార్థులు మృతి చెందుతున్నా.. యాజమాన్యం తీరుపై అనేక ఆరోపణలు వస్తున్నా.. జిల్లా విద్యాశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. చర్యలు తీసుకోకుండా మౌనం వహించడంపై సవాలక్ష ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

## నిర్లక్ష్యం ఖరీదు మరో మరణం..

తేజస్వీ స్కూల్‌లో నెల పదిహేను రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు మరణించడం పాఠశాల యాజమాన్యం, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. గత నెలలో చోటుచేసుకున్న మొదటి మరణంపైనే పాఠశాల యాజమాన్యం, విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకుని ఉంటే రెండో మరణం జరిగి ఉండేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తేజస్వీలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి ఆడుకుంటూనే కుప్పకూలిపోవడం.. ఆసుపత్రికి తరలించే లోపే మరణించినా పాఠశాల యాజమాన్యం తమ తీరు మార్చుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమ్యామ్యాలకు అలవాటు పడిన విద్యాశాఖ అధికారులు పాఠశాల వైపు కన్నెత్తి చూడకపోవడంతోనే రెండో ప్రాణం గాలిలో కలిసిందని బంధువర్గం ఆరోపిస్తోంది. వారి నిర్లక్ష్యం ఖరీదు.. ఇప్పుడు ఇద్దరు విద్యార్థుల చావులు, వారి తల్లిదండ్రుల కడుపుకోతగా మిగిలింది. పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని బాధిత తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

## నిత్యం ట్రాఫిక్ జామ్..

హనుమకొండలోని తేజస్వీ స్కూల్ ప్రాంతంలో ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. పాఠశాలకు విద్యార్థులను తీసుకురావడానికి, తిరిగి ఇంటికి తీసుకెళ్లడానికి వచ్చే స్కూల్ బస్సులు, తల్లిదండ్రుల కార్ల కారణంగా ఆ ప్రధాన రహదారిపై రద్దీ నిత్యకృత్యంగా మారింది. ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ, దీనిపై పోలీసులు గానీ, ట్రాఫిక్ విభాగం గానీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ట్రాఫిక్ జామ్‌పై స్థానికులు, ఇతర వాహనదారులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా, అధికారులు వాటిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. పోలీసులు, అధికారులు తమపై చర్యలు తీసుకోవడం లేదనే ధీమాతో పాఠశాల యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్కూల్ బస్సులు, ప్రైవేటు వాహనాలను రోడ్డుపైనే అడ్డంగా నిలపడంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తోందంటున్నారు. రోడ్డు భద్రతా నిబంధనలను, ట్రాఫిక్ నియమాలను ఏమాత్రం పాటించుకోకుండా పాఠశాల యాజమాన్యం వ్యవహరించడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే ట్రాఫిక్ అధికారులు స్పందించి, పాఠశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## విద్యాశాఖ నిర్లక్ష్యం..

కేవలం నెలన్నరలోనే రెండు మరణాలు సంభవించడంలో విద్యా శాఖ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఇదే ఇప్పుడు విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. తమ పిల్లలను ఈ పాఠశాలకు పంపడం సురక్షితమేనా అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి, పాఠశాలపై సమగ్ర విచారణ జరిపి, యాజమాన్యం తీరుకు కళ్లెం వేయాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్న డిమిండ్ వస్తోంది. తేజస్వీ స్కూల్‌లో తరుచూ విద్యార్థులు మరణించడం పలు అనుమానాలకు తావిస్తోంది. యాజమాన్యం విద్యార్థులపై అధిక ఒత్తిడి ఏమైనా పెడుతున్నారా? లేక దీని వెనుక ఇతర కారణాలు ఉన్నాయా? అనే ప్రశ్నలు తల్లిదండ్రులను వేధిస్తున్నాయి. స్కూల్ ఫీజులు, ఇతర ఫీజుల విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్న ఘటనలు అప్పుడప్పుడు బయటకు వచ్చినా విద్యా శాఖ అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది. ఎన్ని ఆరోపణలు, ఘటనలు జరిగినా తమ తీరులో మార్పు రాదన్నట్లుగా తేజస్వీ స్కూల్ యాజమాన్యం వ్యవహరిస్తోందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోది. అయితే పాఠశాల యాజమాన్యం వెనుక రాజకీయ పలుకుబడి, అండదండలు ఏమైనా ఉన్నాయా అనే అనుమానం కలుగుతోంది. తక్షణమే జిల్లా విద్యాశాఖ, పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.





# ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన సుమ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బదిలీల్లో భాగంగా పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా సేవలు అందిస్తున్న టి.సుమను వరంగల్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వరంగల్ ఆర్డీఓగా టి.సుమ శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు నూతన ఆర్డీఓకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను ఆర్డీఓ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య శారద ఆర్డీఓకు శుభాకాంక్షలు తెలిపారు.

## భద్రకాళి దర్శనం..

వరంగల్ నూతన రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టిన టి.సుమ సుప్రసిద్ధ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం వేద పండితులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందచేశారు.

# అమరుల త్యాగాలు వృథా కావు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, క్రైం :** పోలీస్ అమర వీరుల త్యాగాలు వృథా కావని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను పురస్కరించుకొని వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వరంగల్ సీపీ శనివారం ప్రారంభించారు. రెడ్ క్రాస్ రక్తనిధి సహకారంతో పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని రాణి రుద్రమదేవి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో ముందుగా వరంగల్ పోలీస్ కమిషనర్ స్వచ్ఛందంగా రక్తందానం చేసి పోలీస్ అధికారులు, సిబ్బంది, యువతకు స్ఫూర్తి కలిగించారు. అనంతరం ఆర్మ్డ్ రిజర్వ్, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక యువత, ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారిని సీపీ వ్యక్తిగతంగా కలుసుకొని అభినందించారు. వారికి పండ్లు, సర్టిఫికేట్లను అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీసులు కేవలం శాంతి భద్రతలను పరిరక్షించడమే కాదు సేవా కార్యక్రమాల్లోనకూ ముందు వరసలో ఉంటారన్నారు. ముఖ్యంగా రక్తదానంపై ఉన్న ఆపోహలను తొలగించి ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, సత్యనారాయణ, నాగయ్య, జాన్ నర్సింహులు, జితేందర్ రెడ్డి, ఆర్ఐలు సతీష్, శ్రీధర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, స్పర్జన్, రాజ్, హనుమకొండ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి, ఈవీ శ్రీనివాస్ రావు, రమణ రెడ్డితో పాటు పోలీస్ యూనిట్ వైద్యులు, ఇతర పోలీస్ అధికారులు, పరిపాలన, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థులు పరీక్షలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి

◆ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ :** మండలంలోని పెంబర్తి గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, వసతులపై ఆయన పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మొదటగా స్టాఫ్ రూమ్‌కు వెళ్లి ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి, వాటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం పదో తరగతి తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్ ఎంతవరకు పూర్తయింది, రోజుకు ఎన్ని గంటలు చదువుతున్నారు, స్టడీ అవర్‌లో ఏం చదువుతున్నారు వంటి వివరాలు అడిగారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని ప్రిన్సిపాల్ చంద్రమోహన్ ను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రత్యేక కార్యాచరణ పెట్టుకోవాలని, ఏ ఒక్క రోజు కూడా సమయాన్ని వృథా చేయవద్దని కలెక్టర్ సూచించారు. "ఏ టైంలో చేయాల్సిన పనిని ఆ టైంలోనే చేయాలి. సమయానికి తిని, త్వరగా పడుకుని, ఉదయం లేవాలి" అని తెలిపారు. కష్టంగా ఉన్న సబ్జెక్టులను ఒకటి, రెండు సార్లు రివిజన్ చేసుకుని, వీక్‌గా ఉన్న సబ్జెక్టులపై స్టడీ అవర్ సమయంలో ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఎస్ఏ-1 పరీక్షల్లో ఏ విద్యార్థికి ఏ సబ్జెక్టులో ఎన్ని మార్కులు వచ్చాయో తెలియజేసే నివేదికను ఆయన పరిశీలించారు. తమ తల్లిదండ్రులు నమ్మకంతో వేరే ప్రాంతాల నుంచి వచ్చి ఈ పాఠశాలలో చేర్పించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టేలా బాగా కష్టపడి పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు కూడా పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఏ విద్యార్థి ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నాడో గమనిస్తూ ఉండాలన్నారు. అవసరమైన విద్యార్థులకు పలు మార్లు రివిజన్ చేస్తూ, వారు ఆయా సబ్జెక్టులలో బాగా రాణించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఈ తనిఖీలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తిరుమలలో అఖండ హరినామ సంకీర్తన



**వరంగల్ వాయిస్, శాయంపేట :** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్వహించిన అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో గట్లకానిపర్తి గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర ధార్మిక భజన మండలి, వైనాల సంతోష్ బాబు నాయకత్వంలో తిరుమలలో భజన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భజన సభ్యుల గానం, భక్తిభావం తిరుమల కొండపై మారుమోగి, భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ అఖండ హరినామ సంకీర్తనలో మన్నెమ్మ, వైనాల సంతోష్ బాబుతో పాటు రమేష్, రవీందర్, రాజేందర్, రవీందర్, అశోక్ కుమార్, రమేష్, రమాదేవి, తిరుమల, విజయ మాధవి, రజిత, స్వర్ణలత, శ్రీదేవి, రజిత, సన్నిక, శ్రీజ, సౌమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు. వారి భక్తిపూర్వక గానం, సంకీర్తనలతో తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## పరకాలలో మహా రుద్రయాగానికి శ్రీకారం

సకల ధాన్య సంగ్రహణ సహిత నగరోత్సవం




**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల పట్టణంలో నిర్వహించనున్న మహా రుద్రయాగానికి సన్నాహాలు మొదలయ్యాయి. దీనిలో భాగంగా శ్రీ కుంకుమేశ్వర ఆలయంలో శని, ఆది, సోమవారాలలో సకల ధాన్య సంగ్రహణ సహిత నగరోత్సవం అత్యంత వైభవంగా ప్రారంభమవుతుందని ఆలయ అర్చకులు కోమాళ్ళపల్లి సంపత్ శర్మ, మహా రుద్రయాగ కమిటీ సభ్యులు తెలియజేశారు. సంపత్ శర్మ మాట్లాడుతూ ఈ మూడు రోజులలో పరకాల పట్టణంలోని ప్రతి వీధిలో ధాన్య సంగ్రహణ వాహనం తిరుగుతుందని, భక్తులు తమ ఇంటి నుండి ధాన్యాన్ని సమర్పించి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లలో ఆలయ చైర్మన్ కొలువురు రాజేశ్వరరావు, మహా రుద్రయాగ కమిటీ అధ్యక్షుడు ఎర్ర లక్ష్మన్న, ఆలయ కమిటీతో పాటు మహా రుద్ర యాగ కమిటీ సభ్యులు పావుశెట్టి అనిల్, సుంకరి రామన్న, తోట రవీందర్, ఆముదాల పెళ్లి అశోక్ గౌడ్, వావిలాల రాము, కొత్తపల్లి రవీందర్ తదితరులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## సమ్మేటివ్-1 పరీక్షల పరిశీలన



**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండ జిల్లాలో శుక్రవారం ప్రారంభమైన ఉన్నత పాఠశాల విద్యార్థుల సమ్మేటివ్-1 (ఎస్ఏ-1) పరీక్షలను జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి డాక్టర్ బి.రాంధన్, సహాయ కార్యదర్శి జి. ప్రసన్న కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పరీక్షలు శుక్రవారం ప్రారంభమై ఈ నెల 31 వరకు ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు జరగనున్నాయి. దామెర మండలం ఊరుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ అధికారులు పరీక్షా సరళిని పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.సత్యనారాయణతో కలిసి వివిధ తరగతి గదులలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రశ్నపత్రంలో ఏవైనా అచ్చు తప్పులు దొర్లాయా అని విద్యార్థులను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. వివిధ సామర్థ్యాలపై విద్యార్థులకు ఏ విధమైన నైపుణ్యం ఉందో పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంధన్ విద్యార్థులకు పరీక్షలు బాగా రాయాలని పలు సూచనలు చేశారు. అలాగే, ఉపాధ్యాయులకు కూడా పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం గురించి పలు సలహాలు ఇచ్చారు.

## అంగరంగ వైభవంగా ప్రముఖ న్యాయవాది కూతురి వివాహం



వరంగల్ వాయిస్, వరంగల్ : ప్రముఖ న్యాయవాది బండి మొగిలి, కనక లక్ష్మీ దంపతుల కుమార్తె నిహారిక వివాహం రవిచంద్రతో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. వరంగల్‌లోని చింతగట్టులో ఉన్న బీ.జీ.ఆర్ రాక్ గార్డెన్‌లో జరిగిన ఈ వివాహ వేడుకకు బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నూతన వధూవరులైన నిహారిక, రవిచంద్రులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. తమ కుమార్తె వివాహ కార్యక్రమానికి పెద్ద మనసుతో హాజరై, ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ న్యాయవాది బండి మొగిలి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** స్థానిక మండలానికి చెందిన రెండు కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శుక్రవారం పరామర్శించారు. పర్వతగిరి మండలానికి చెందిన పోకల శంకర్ తల్లి పోకల లక్ష్మి, వర్ధినేని సుధీర్ రావు తల్లి వర్ధినేని లక్ష్మి ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎర్రబెల్లి దయాకర్ రావు నేడు వారి నివాసాలకు చేరుకున్నారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, మనోధైర్యాన్ని నింపారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తో పాటు ఈ పరామర్శ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఎం.మనోజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, జిల్లా మాజీ రైతు బంధు సభ్యులు చింతపట్ల సోమేశ్వర్ రావు, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, మాజీ సర్పంచ్ లు గొనె సంపత్, బొట్ల కిష్టయ్య, వడ్లకొండ సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు అమడగని రాజు యాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షులు మెరుగు వెంకటేశ్వర్లు, మండల నాయకులు రంగు కుమార్ (ఫర్టిలైజర్), చింతపట్ల సునీల్ రావు, సముద్రాల రాజయ్య, నారెడ్ల చంద్రయ్య, జుట్టుకొండ నాగన్న, శ్రీరాముల శ్రీనివాస్, బొట్ల శ్రీకాంత్, నియోజకవర్గ సోషల్ మీడియా నాయకులు చిన్నపెల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలి

మండల వ్యవసాయ అధికారి జై సింగ్



**వరంగల్ వాయిస్, నడికూడ :** వ్యవసాయ యాంత్రీకరణ కార్యక్రమంలో భాగంగా రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు అందజేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడికూడ మండలానికి బ్యాటరీ స్ప్రేయర్ (132), పవర్ స్ప్రేయర్ (27), రోటోవేటర్స్ (7), బ్రష్ కట్టర్స్ (2),పవర్ వీడర్లు (1), స్ట్రా బేలర్ (1), పవర్ టిల్లర్ (1 )ట్రాక్టర్ పనిముట్లు కల్టివేటర్లు , ఎంబీ ప్లవ్, డిస్క్ హారో (9), సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్ (1 )బండ్ ఫార్మర్ (1 ) రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కావలసిన రైతులు ఈ నెల 31 లోగా మండల వ్యవసాయ అధికారి కార్యాలయం, వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఉంటుందని అన్నారు. దరఖాస్తు చేసే రైతులు ఫారం నింపి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుల జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ ను జత చేసి ఇవ్వాలన్నారు. ట్రాక్టర్ యంత్ర పరికరాల కోసం దరఖాస్తు చేసే రైతులు ట్రాక్టర్ ఆర్ సీ పేపర్ జత చేయాలన్నారు. దరఖాస్తులను 31లోగా అందజేయాలని కోరారు.

# ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థినులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుజాత ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుజాత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను తప్పక పాటించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలి. ఫోర్ వీలర్ డ్రైవర్లు కచ్చితంగా సీటు బెల్టు పెట్టుకోవాలి. డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు, ముఖ్యంగా మైనర్లు వాహనాలను నడపకూడదని ఆమె స్పష్టం చేశారు. సుజాత విద్యార్థినులకు మహిళా రక్షణ గురించి అవగాహన కల్పించారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి సంఘటనలను ఏ మాత్రం ఉపేక్షించకుండా వెంటనే పోలీసులకు రిపోర్ట్ చేయాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన షీ టీమ్‌ల సేవలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థినిలు, పద్మావతి కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

# సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు

## 31లోపు దరఖాస్తు చేసుకోండి

**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని రైతు సోదరులకు వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా (ఎస్ఎంఏఎం పథకం కింద) సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. ఆసక్తి గల రైతులు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మండలానికి కేటాయించిన పనిముట్లు, వాటి వివరాలు బ్యాటరీ స్ప్రేయర్లు-102, వర్ స్ప్రేయర్లు-21, రోటోవేటర్లు-5, కల్టివేటర్లు & ఎంబీ ప్లావు-7, బ్రష్ కట్టర్-1, పవర్ వీడర్-1, స్ట్రా బేలర్-1, పవర్ టిల్లర్-1, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్-1 లు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ రైతులకు, జనరల్ మహిళా రైతులకు 50% సబ్సిడీ, ఇతరులకు 40శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. కావాల్సిన రైతులు రైతు వేదిక, దామెరలో దరఖాస్తు ఫారాలను పొందవచ్చు లేదా తమ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించవచ్చు. దరఖాస్తుతో జత చేయాల్సిన పత్రాలు పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో లు జత చేయాల్సి ఉంటుంది. దరఖాస్తులను స్వీకరించడానికి చివరి ఈనెల 31 లోపు రైతులు దరఖాస్తులు సమర్పించి సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాల కోసం సంబంధిత ఏఈఓలను సంప్రదించగలరని పేర్కొన్నారు.

# గాలికుంటు టీకాలపై ఏడీ పరిశీలన



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని లాదెళ్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పశువులలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమ శిబిరాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) డాక్టర్ పి. శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన టీకాల కార్యక్రమాన్ని, నిర్వహణ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా తమ పశువులకు ఈ గాలికుంటు నివారణ టీకాలు ఇప్పించడం వలన పశువుల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తద్వారా పశువుల ఉత్పత్తి సామర్థ్యం (పాల దిగుబడి, సంతానోత్పత్తి) పెంపొందించబడుతుందని అన్నారు. కాబట్టి, జిల్లాలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ దీపిక, వీఎల్ఓ గంధం లక్ష్మణ్, జేవీఓ సారంగం, ఎల్ఎస్ఏ సిరాజుద్దీన్, సిబ్బంది శంకర్, సతీష్, మరియు గ్రామ పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా అభివృద్ధి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పరంపర కొనసాగుతోంది. శుక్రవారం ఒకే రోజు సుమారు రూ. 4.07 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో 57వ డివిజన్, 59వ డివిజన్‌లలో అంతర్గత రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రైనేజీ నిర్మాణం, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధియే తన ధ్యేయమని స్పష్టం చేశారు. "అభివృద్ధి విషయంలో మేము రాజకీయాలకు అతీతంగా పనులు చేస్తున్నాం. అన్ని డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. వర్షాకాలంలో నీరు నిల్వకుండా ఉండేందుకు అనేక ప్రాంతాలలో పనులు మెరుగుపడ్డాయి," అని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి డివిజన్‌ను పర్యటించి, ప్రతి కాలనీలో ప్రజల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు

# అంగన్వాడీ పంపిణీలో లోపాలు సహించం

## ◆ కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషక పదార్థాల పంపిణీలో ఎలాంటి లోపాలు ఉన్నా చట్టపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు తెలియజేస్తామని 40వ డివిజన్ కార్పొరేటర్, అంగన్వాడి చైర్‌పర్సన్ మరుపల్ల రవి హెచ్చరించారు. శుక్రవారం ఆయన కరీమాబాద్ సెక్టార్, కామినిపెంట సెకండ్ అంగన్వాడి కేంద్రం (నెం. 46) ను సూపర్వైజర్ మాధవితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రం పనితీరును, సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ మరుపల్ల రవి అంగన్వాడి లెవెల్ మానిటరీ సపోర్ట్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషక విలువలు కలిగిన గుడ్లు, పాలు, అన్నం, మురుకులు, పల్లి పట్టీలు, బాలామృతం వంటి పదార్థాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పిల్లలకు వైద్యాధికారులు ఆరోగ్య పరీక్షలు సరిగా నిర్వహిస్తున్నారా లేదా అని కూడా తెలుసుకున్నారు. "అంగన్వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకున్న వారికి పోషక విలువలు గల ఆహార పదార్థాలు అందకపోతే, వెంటనే నా దృష్టికి గానీ, సూపర్వైజర్ దృష్టికి గానీ తీసుకురావాలి," అని కార్పొరేటర్ రవి కోరారు. సూపర్వైజర్ మాధవి మాట్లాడుతూ తమ కేంద్రం పరిధిలో తక్కువ బరువు కలిగిన పిల్లలకు బాలామృతం ప్లస్ అందిస్తున్నామని, దీనిని తీసుకున్న పిల్లలు క్రమం తప్పకుండా బరువు పెరుగుతున్నారని తెలిపారు. కార్పొరేటర్ చైర్‌పర్సన్ మరుపల్ల రవి కేంద్రంలోని హాజరు పట్టికలను సైతం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ మనీమాల, కమిటీ సభ్యులు రాణి, దివ్య, రోజా రాణి, రవళి, దీపిక, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# వైభవంగా కార్తీక మాస పూజలు

## 108 శివలింగాకార దీపాలతో ఆరాధన



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్‌లో కొలువైన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో కార్తీక మాస పూజలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయని ఆలయ పూజారి మారుపాక శ్యాంప్రసాద్ తెలిపారు. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 20 వరకు ముప్పై రోజుల పాటు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం 108 శివలింగాకార దీపాలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్తీక మాసంలో శివనామస్మరణ, దీపారాధన, నదీ స్నానం వంటి నియమాలను పాటిస్తే ఆధ్యాత్మిక, శాస్త్రీయ, ఆరోగ్య ప్రయోజనాలు కలగడంతో పాటు శరీరం ఉత్సాహంగా ఉంటుందని పూజారి తెలిపారు. అలాగే, ఉసిరి చెట్టు కింద భోజనాలు, దానధర్మాలు చేయడం వలన కుటుంబ కలహాలు, చీడపీడల బాధ తొలగిపోయి, సుఖశాంతులు కలుగుతాయని, దరిద్రం తొలగిపోతుందని అన్నారు. ఇంట్లో దీపాలు వెలిగించడం ద్వారా పితృదేవతల ఆత్మ శాంతించి, వారి ఆశీస్సులు లభిస్తాయని చెప్పారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు దూడల రమేష్, శోభారాణి, లగిశెట్టి పద్మావతి, తూముకుంట్ల వెంకట నరసింహారెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, అయిత జయరాములు, గట్టు భిక్షపతి, వాణి, దోసపాటి శ్రీలక్ష్మి, తూముకుంట్ల విజయ, స్వాతి, సరళ, ఆలేటి పద్మ, గట్టు విజయ గౌడ్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు

# నూతన దంపతులను ఆశీర్వదించిన కాళీ ప్రసాద్ రావు



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన మేడిపల్లి పద్మ, రాజన్న కుమారుడు ప్రణయ్ కుమార్ వివాహం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు, పరకాల నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులైన ప్రణయ్ కుమార్, రేణుశ్రీ దంపతులను ఆశీర్వదించి, కానుక అందజేశారు. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పసరగొండ బీజేపీ నాయకులు కొట్టే రమేష్, మంద రమేష్, మంద దేవేందర్, మంద కట్టయ్య, మేడిపల్లి కుమారస్వామి, ఐత రాజు, కొట్టే రాజు, మేడిపల్లి శ్రీనివాస్, మేడిపల్లి కుమార్, మేడిపల్లి శ్రీకాంత్, మంద మనోజ్ కుమార్, చెక్క సతీశ్, మంద సతీష్, శనిగరం దేవేందర్, అన్న రాజు, ఐత రజిని, మాడిశెట్టి కుమార్, మాడిశెట్టి శ్రీశైలం, నల్లెల శివకుమార్, పోతరాజు అఖిల్, మేడిపల్లి శివ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ గీసుగొండ మండల అధ్యక్షులు కొంగర రవికుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లం కేదరి, కిసాన్ మోర్చా మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు బూర్గుల యుగేందర్ తో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు కొంగర రంజిత్, అల్లం చిరంజీవి, పొన్నాల మహేందర్, పొన్నాల నిఖిల్, కొంగర అన్వేష్, కొంగర సురేష్, చీమలపాటి చిరంజీవి తదితరులు కూడా విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# బీసీలను రౌడీలు అనడం కేసీఆర్‌కు అలవాటే

## • బండి సుధాకర్ గౌడ్ మండిపాటు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** బీసీలను రౌడీలుగా అభివర్ణించడం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అలవాటేనని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కుటుంబాన్ని ఉద్దేశించి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన సందర్భంగా, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న సుధాకర్ గౌడ్ ఈ వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కుటుంబాన్ని ఉద్దేశించి 'రౌడీ కుటుంబం' అని కేసీఆర్ అగ్రకుల దురహంకారంతో మాట్లాడటం సరికాదని ఆయన తీవ్రంగా ఖండించారు. "పదేళ్ల కేసీఆర్ దొర పాలనలో నవీన్ యాదవ్ పై ఎన్ని కేసులున్నాయో కేసీఆర్ చెప్పాలి. ఉప ఎన్నిక జరుగుతున్న ఈ సమయంలో రౌడీషీటర్లను, పోక్సో కేసులున్న వారిని బీఆర్ఎస్ పార్టీలో ఎందుకు చేర్చుకుంటున్నారో కేసీఆరే సమాధానం చెప్పాలి," అని బండి సుధాకర్ గౌడ్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుంటే, ప్రజల ఆదరణ పొందుతుంటే ఓర్వలేకనే ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. తెలంగాణ సంపదను రాబందుల్లా దోచుకున్న కేసీఆర్ కుటుంబీకులు, ఖజానాను ఖాళీ చేసి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దించారని ఆయన దుయ్యబట్టారు. కేంద్రంలోని బీజేపీ కూడా ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా ఆదరణ కోల్పోయిందని అన్నారు. ఓట్ల కోసం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి వచ్చే బీఆర్ఎస్, బీజేపీ నాయకులను ప్రజలు నిలదీయాలని, అధికార కాంగ్రెస్ పార్టీని ఆదరించి, ప్రతిపక్షాలకు తగిన బుద్ధి చెప్పాలని బండి సుధాకర్ గౌడ్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లోని రహమత్ నగర్‌లో జరిగిన ఇంటింటి ప్రచారంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కెనడీ, జాన్, జోసెఫ్, పీటర్, చందు తదితరులు పాల్గొన్నారు.

# ‘బహుజనుల డంకా’ మోగించడమే టీఆర్పీ లక్ష్యం



■ మాదం రజనీ కుమార్ యాదవ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణలో అగ్రవర్ణ పార్టీల కోటను బద్దలు కొట్టి, బహుజన రాజ్యాన్ని స్థాపించేందుకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) కట్టుబడి ఉందని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజనీ కుమార్ యాదవ్ ప్రకటించారు. రాబోయే 100 రోజుల్లో బహుజనుల ‘డంకా’ తెలంగాణ అంతటా మోగబోతుందని ఆయన స్పష్టం చేశారు. టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ శారద ఫంక్షన్ హాల్లో టీఆర్పీ జిల్లా, నియోజకవర్గ కన్వీనర్లు, కో-కన్వీనర్ల నియామకంపై ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రజనీ కుమార్ యాదవ్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాదం రజనీ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఇన్నాళ్లు బీసీల పేరుతో ఓట్లు సేకరించి, అగ్రవర్ణాల పక్షాన నిలిచిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల అసలు స్వరూపాన్ని ప్రజల ముందుకు తెస్తామని హెచ్చరించారు. తెలంగాణలో బీసీలకు అన్ని రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అందే వరకు టీఆర్పీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాజకీయ రంగంతో పాటు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల వరకు రిజర్వేషన్లు అమలు చేయాలనే సంకల్పంతో టీఆర్పీ ఉందని అన్నారు. తీన్మార్ మల్లన్న నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని మరింత బలంగా, ఉధృతం చేస్తామని తెలిపారు. “మా వర్గాల ప్రజలందరినీ ఐక్యం చేసి బహుజనుల రాజ్యాన్ని తెలంగాణలో నెలకొల్పుతాం,” అని ఆయన పునరుద్ఘాటించారు. ప్రధాన రాజకీయ పార్టీలు తమ వైఖరిని మార్చుకోకపోతే వారికి తెలంగాణలో రాజకీయ సమాధి తప్పదని ఆయన హెచ్చరించారు. సమావేశంలో జిల్లా స్థాయి నాయకుల నియామకంపై, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ‘మేమెంతో – మాకు అంత’ అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని నాయకులు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో టీఆర్పీ జెండా ఎగురవేసి, బహుజన ఉద్యమాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లామని తీర్మానించారు. సమావేశాన్ని విజయవంతం చేసిన నాయకులకు రజనీ కుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

# కేయూలో ఆధునీకరణ పనులు ప్రారంభం



◆ హాస్టల్‌కు కొత్త వంటశాల, సెమినార్ హాల్ అభివృద్ధి

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల వసతి, అకడమిక్ సౌకర్యాల కోసం రూ. 53 లక్షల వ్యయంతో చేపట్టిన ఆధునీకరణ పనులను శుక్రవారం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ప్రారంభించారు. డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం న్యూ పీజీ హాస్టల్‌లో విద్యార్థుల అవసరాల కోసం రూ. 40 లక్షల వ్యయంతో అదనపు కిచెన్ వసతిని కల్పించారు. ఇది 3,800 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించబడింది. దీని ద్వారా సుమారు 600 మంది విద్యార్థుల వంటశాల అవసరాలు తీరనున్నాయి. అదేవిధంగా, హ్యూమానిటీస్ బిల్డింగ్‌లోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో గల సెమినార్ హాల్‌ను రూ. 13 లక్షల వ్యయంతో ఆధునీకరించారు. ఇది 1,600 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 135 సీటింగ్ సామర్థ్యం కలిగి ఉంటుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య టి.మనోహర్, వసతి గృహాల సంచాలకులు డాక్టర్ ఎల్. పి.రాజ్ కుమార్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ అధిపతి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, పాలక మండలి సభ్యులు ఆచార్య బి.సురేష్ లాల్, డాక్టర్ ఎస్.సుదర్శన్, డాక్టర్ సుకుమారి, డాక్టర్ చిర్రా రాజు, అనిత రెడ్డి, ఆచార్య పి.మల్లారెడ్డి, ఆచార్య మామిడాల ఇస్తారి, ఆచార్య అమరావేణి, డాక్టర్ నరేందర్, డాక్టర్ మంజుల, బిల్డింగ్ డివిజన్ సిబ్బంది, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ‘సృష్టికే సవాల్ విసిరింది తెలంగాణ కళ’

■ కాళోజీ స్మారకోపన్యాసంలో డాక్టర్ నరసింహా రెడ్డి

**వరంగల్ వాయిస్, కేయూ :** తెలంగాణ కళ “సృష్టికే ప్రతి సవాలు విసిరింది” అని డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజ్ అండ్ కల్చర్, గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ సంచాలకులు డాక్టర్ నరసింహా రెడ్డి అనుగు అన్నారు. కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో శుక్రవారం ఉదయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజా కవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణ రావు 9వ స్మారక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, డాక్టర్ నరసింహా రెడ్డి “సాయుధ పోరాటం, తొలి మలి దశ ఉద్యమాలు: కవిత్వం” అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. డాక్టర్ నరసింహా రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకు కేంద్ర బిందువు వరంగల్ అని, కాళోజీ స్వేచ్ఛకు, ఇచ్చకు ప్రతీక అని అన్నారు. మనసులో ఉన్నది బహిరంగంగా వెల్లడించే మనస్తత్వం కాళోజీదని గుర్తు చేశారు. “తెలంగాణ గొప్ప సృజనకారులకు నిలయం. ఎక్కడ సంఘర్షణ ఉంటుందో, అక్కడ సృజన ఉంటుంది. సాహిత్యం, కళలు తెలంగాణలోనే అపారంగా అభివృద్ధి చెందాయి,” అని ఆయన పేర్కొన్నారు. తొలి దశ ఉద్యమం, మలి దశ ఉద్యమం మరియు 2014లో వచ్చిన ఉద్యమాలలో కవిత్వం ప్రధాన భూమిక వహించిందని వెల్లడించారు. సోషల్ మీడియా లేని కాలంలోనూ కవిత్వం కీలక పాత్ర పోషించిందని, కవిత్వం ద్వారానే ఫర్మానాలు వచ్చాయని తెలిపారు. సాయుధ పోరాట సమయంలో గొప్ప సాహిత్యం వచ్చిందని, నూరేళ్ల చరిత్రలో వచ్చిన ఈ గొప్ప కవిత్వం గురించి నేటి విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వీసీ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కవుల పాత్ర, వారి కవిత్వం పాత్ర అమోఘం అని కొనియాడారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు వారి సబ్జెక్టుకే పరిమితం కాకుండా, సాహిత్యం, కళలపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ ప్రపంచానికి కాళోజీని అందించింది తెలంగాణేనని చెప్పారు. పొట్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాళోజీ మానవత్వానికి నిలువెత్తు సంతకం అని కొనియాడారు. వి. ఆర్. విద్యార్థి కాళోజీ ఫౌండేషన్ గురించి వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం స్మారకోపన్యాసకర్తను పరిచయం చేశారు. ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీరాజ్ వల్లాల సంయోజకులుగా వ్యవహరించారు.

# గోశాలకు దాన బస్తాల వితరణ

**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళాక్షేత్రంగా విరాజిల్లుతున్న గణపురం మండల కేంద్రంలోని శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం గోశాల గోమాతలకు శుక్రవారం నాడు దాన బస్తాలు అందజేశారు. గణపురం మండల కేంద్రానికి చెందిన సూర్యదేవర స్రవంతి, కార్తీక్ దంపతులు తమ కుమారుడు ఆరవ్ సాయి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ వితరణ చేశారు. జన్మదినం సందర్భంగా దంపతులు ముందుగా స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. గోశాలలోని గోమాతలకు దాన బస్తాలను అందజేసిన కార్తీక్, స్రవంతి దంపతులకు కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. అలాగే, ఆరవ్ సాయికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.


# ప్రైవేట్ వాహన ప్రయాణాలు ప్రమాదకరం

## సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భద్రతా ప్రమాణాలు పాటించని, కాలం చెల్లిన ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించడం ఎంత ప్రమాదకరమో కర్నూలు శివారులోని చిన్నటేకూరు వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం మరోసారి రుజువు చేసిందని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినవారికి ఆయన తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ దుర్ఘటనలో తెలంగాణవాసులు సైతం ప్రాణాలు కోల్పోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. “ఇకనైనా ప్రజలు ప్రైవేట్ వాహనాలలో ప్రయాణించడం మానుకోవాలి. ఎంతో అనుభవం, నిపుణులైన డ్రైవర్లు కలిగిన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడమే క్షేమదాయకం,” అని ఆయన సూచించారు. ప్రజలు ఇప్పటికైనా భద్రతకు ప్రాముఖ్యత ఇచ్చి, తమ ప్రయాణ వాహనాలను ఎన్నుకోవాలని నిమ్మల శ్రీనివాస్ హితవు పలికారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన మార్నేని రవీందర్ రావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం మాజీ జడ్పీటీసీ మల్క అమరావతి-రమేష్ దంపతుల కుమార్తె వివాహ వేడుక శుక్రవారం హనుమకొండలోని పీజీఆర్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి హాజరయ్యారు. నూతన దంపతులను వారు ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# పొలిటికల్ సైన్స్ విభాగంలో చైతన్య కుమారికి డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకురాలు కె. చైతన్య కుమారికి డాక్టరేట్ లభించింది. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల శుక్రవారం ప్రకటించారు. చైతన్య కుమారి “పబ్లిక్ పాలసీ అండ్ ట్రైబల్ వెల్ఫేర్: ఏ స్టడీ ఆఫ్ ఐటీడీఏ ప్రోగ్రామ్స్ ఇన్ కొమురం భీమ్ ఆసిఫాబాద్ డిస్ట్రిక్ట్” అనే అంశంపై తన పరిశోధనను పూర్తి చేశారు. ఈ పరిశోధనను విభాగ ఆచార్యులు, కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం పర్యవేక్షణలో పూర్తి చేయడం జరిగింది. మంచిర్యాల జిల్లాకు చెందిన చైతన్య కుమారికి డాక్టరేట్ లభించిన సందర్భంగా పొలిటికల్ సైన్స్ విభాగ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎర్రబెల్లి స్వర్ణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ డీసీసీ అధ్యక్షుడు ఎర్రబెల్లి స్వర్ణ శుక్రవారం ఉమ్మడి జిల్లా పరిధిలో జరిగిన పలు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. మడికొండలోని సత్య సాయి కన్వెన్షన్ హాల్‌లో జరిగిన శ్రావణి –రామ్ చేతన్ వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వధూవరులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కూడా పాల్గొన్నారు. వడ్డేపల్లి 100 ఫీట్ రోడ్‌లోని పిజిఆర్ గార్డెన్స్‌లో జరిగిన మాజీ జడ్పీటీసీ మల్క అమరావతి–రమేష్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని, నూతన దంపతులను ఆశీర్వదించారు. హసన్‌పర్తి లోని సాయిని గార్డెన్స్‌లో మోతే పుష్పలత–రవీందర్ రెడ్డి దంపతుల కుమారుని వివాహ వేడుకలో హాజరై, వధూవరులకు దీవెనలు అందించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్మంతులుగా జీవించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఆమె వెంట ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ వేముల నాగరాజు, కాంగ్రెస్ నాయకులు మల్లం కుమార్, అంకెశ్వరపు సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా జ్ఞాన సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్టాపన



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయం పరిసరాల్లో ఏర్పాటు చేసిన జ్ఞాన సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. గత మూడు రోజులుగా వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం శుక్రవారం నాడు ప్రత్యేక పూజల నడుమ జ్ఞాన సరస్వతి దేవి విగ్రహాన్ని ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. జ్ఞాన సరస్వతి దేవి విగ్రహాన్ని అందించిన దాతలు, చందుపట్ల నరసింహారెడ్డి – వనమాల దంపతులు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, హోమం చేపట్టారు. ఈ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారులు జానకి రామారావు, శ్రీ ధర్మశాస్త్ర ఆలయ కమిటీ అధ్యక్షులు నేరెళ్ల అశోక్, సభ్యులు కుమారస్వామి, కరుణాకర్, సదానందం, శ్రీధర్, మల్లారెడ్డి, సునీల్, హరి కృష్ణ పాల్గొన్నారు.

# చిన్నారి ఆశ్రుతను ఆశీర్వదించిన సోదా రామకృష్ణ



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల మున్సిపల్ పరిధిలోని రెండో వార్డుకు చెందిన ఒంటేరు ప్రతిభ–అనిల్ కుమార్ దంపతుల కూతురు ఆశ్రుత నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ వేడుకలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ పాల్గొన్నారు. చిన్నారి ఆశ్రుతను ఆయన ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బొచ్చు జెమిని తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా అంతర్ కళాశాలల క్రీడలు ప్రారంభం

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ మైదానంలో శుక్రవారం అంతర్ కళాశాలల పురుషుల రెండవ దఫా క్రీడలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా కేయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ప్రతాపరెడ్డి, ప్రిన్సిపాల్ (యూనివర్సిటీ కాలేజ్) ప్రొఫెసర్ మనోహర్, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య పాల్గొన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ ఎస్. కుమారస్వామి వ్యవహరించారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుండి దాదాపు 500 మంది విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొంటున్నారు. సాఫ్ట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, ఖో ఖో, హ్యాండ్‌బాల్ క్రీడలు జరుగుతున్నాయి. క్రాస్ కంట్రీ 25న ఉదయం 5 గంటలకు జరుగుతుంది ఈ క్రీడలతో పాటు, పాల్గొన్న విద్యార్థుల నుంచి కాకతీయ యూనివర్సిటీ జట్టును కూడా ఎంపిక చేయనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్. కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పడిన కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జె. సోమన్న, సెక్రెటరీ డాక్టర్ కె. సునీల్ రెడ్డి, ట్రెజరర్ ఎస్. కిరణ్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ బొల్లం రమేష్ తదితర కమిటీ సభ్యులు వీసీ ముందు యూనివర్సిటీలో క్రీడల అభివృద్ధికి




సంబంధించిన కొన్ని ప్రతిపాదనలను ఉంచారు. దీనికి స్పందించిన వీసీ ప్రొఫెసర్ కె. ప్రతాపరెడ్డి.. కేయూ క్రీడల అభివృద్ధికి అన్నివేళలా తాను తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు ముఖ్యపాత్ర పోషిస్తాయని, దీనివల్ల మానసిక, శారీరక, సాంఘిక పరిపక్వత పెరుగుతుందని తెలిపారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అన్న మాటను గుర్తు చేస్తూ, ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొని, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని, రోజువారీ దినచర్యలో వ్యాయామానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.

# పౌష్టికాహార లోపం సవాళ్లను పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** పౌష్టికాహార లోపం సవాళ్లను పరిష్కరించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) పెద్ది ఆంజనేయులు పిలుపునిచ్చారు. ముఖ్య కార్యనిర్వహణాధికారి, పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), హైదరాబాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ), హనుమకొండ ఆదేశాల మేరకు ఆయన ఈ సూచనలు చేశారు. ప్రతి మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి, అన్ని శాఖల సమన్వయంతో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు ఎంపీడీఓ తెలిపారు. మండల స్థాయిలో చైర్మన్ గా ఎంపీడీఓ, కన్వీనర్ గా ఏపీఎం, సభ్యులుగా ఎంపీఓ, మెడికల్ ఆఫీసర్, ఎంఈఓ, ఐసీడీఎస్ సూపర్వైజర్, మండల సమాఖ్య అధ్యక్షులు ఉంటారు. గ్రామ స్థాయి కమిటీలు చేపట్టిన కార్యక్రమాలను మండల స్థాయి కమిటీ తప్పనిసరిగా పర్యవేక్షించాలని ఎంపీడీఓ ఆదేశించారు. ఏపీఎం మహేందర్, ఎంపీఓ గజ్జెల విమల, ఎంఎల్హెచ్‌పి డాక్టర్ వంశీరెడ్డి, ఎంఈఓ ఎస్.రమాదేవి, ఐసీడీఎస్ సూపర్వైజర్ రాణి, మండల సమాఖ్య అధ్యక్షులు పుష్పలత, పంచాయతీ కార్యదర్శులు వెంకట లక్ష్మణ్, సుమలత, వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం నియోజకవర్గ పరిధిలో జరిగిన పలువురు ఆత్మీయ మరియు ముఖ్య నాయకుల వివాహ వేడుకలకు, నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వడ్డేపల్లి పీజీఆర్ గార్డెన్స్లో జరిగిన మల్క అమరావతి–రమేష్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్నారు. బీజీఆర్ రాక్ గార్డెన్స్ లో జరిగిన ప్రముఖ న్యాయవాది బండి మొగిలి కుమార్తె వివాహ వేడుకకు హాజరయ్యారు. హసన్‌పర్తి సాయిని గార్డెన్స్ లో జరిగిన మోతే రవీందర్ రెడ్డి కుమారుడి వివాహ వేడుకలో పాల్గొని ఆశీర్వదించారు. రాంపూర్ వినాయక కన్వెన్షన్ హాల్లో జరిగిన దోమల స్వరూప–గాలిరెడ్డి కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్నారు. అదేవిధంగా, హనుమకొండ శ్రీహర్ష కన్వెన్షన్ హాల్లో జరిగిన మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు కుమారుడి నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరై, కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వధూవరులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

# నిత్యజీవిత ఉపకరణాల మన్నికకు మూలం 'రాగి'

సీలింగ్ ఫ్యాన్‌లు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్‌లు, ఎయిర్ కండిషనర్ల వంటి విద్యుత్ ఉపకరణాలు ఆధునిక జీవితంలో అంతర్భాగాలు. అయితే, వీటిలో కొన్ని ఎందుకు ఎక్కువ కాలం పనిచేస్తాయో, మరికొన్ని ఎందుకు త్వరగా చెడిపోతాయో చాలామంది పట్టించుకోరు. వినియోగదారులు సాధారణంగా తక్కువ ధరకే ప్రాధాన్యత ఇస్తారు. కానీ, ఒక పరికరం యొక్క నిజమైన విలువ దాని ప్రారంభ ధరలో కాకుండా, దాని దీర్ఘకాల మన్నిక, విద్యుత్ వినియోగం, మరమ్మత్తుల ఫ్రీక్వెన్సీపై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మొదట చవకగా కనిపించే పరికరం, అధిక విద్యుత్ బిల్లులు, తరచుగా మరమ్మత్తుల కారణంగా అత్యంత ఖరీదైనదిగా మారే ప్రమాదం ఉంది.

ఈ విద్యుత్ యంత్రాల పనితీరు, ఆయుష్షును నిర్ణయించే కీలకమైన, దాగిన పదార్థం రాగి. ఇది ఫ్యాన్‌లు, పంపులు, కంప్రెషర్‌లను నడిపే మోటార్లలో చుట్టుకుని ఉండి, మన ఇళ్లలో నిశ్శబ్దంగా పనిచేసే హీరోగా వ్యవహరిస్తోంది. రాగి విద్యుత్‌ను అత్యంత సమర్థవంతంగా ప్రసారం చేస్తుంది. ఇది వేడిని తట్టుకుంటుంది. అందువల్ల భారతదేశంలోని వేడి, తేమ వాతావరణంలోనూ పరికరాలు సుస్థిరంగా పనిచేస్తాయి. రాగి వినియోగంతో యంత్రాలు ఎక్కువకాలం పనిచేస్తే, వినియోగదారులకు మరమ్మతులు, మార్పులపై ఖర్చు తగ్గుతుంది. అంతేకాక, ఇది పర్యావరణంపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. దీర్ఘాయుష్షు గల యంత్రాలు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గిస్తాయి, కొత్త ముడిసరుకులపై డిమాండ్‌ను తగ్గిస్తాయి. రాగి వంటి పదార్థాలను తమ నాణ్యత కోల్పోకుండా మళ్లీ రీసైకిల్ చేసుకోవచ్చు. ఇది భారతదేశం వనరులను సమర్థంగా వినియోగించే సర్క్యులర్ ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు వేయడానికి దోహదపడుతుంది. దీర్ఘకాలం పనిచేసే ఉత్పత్తులను ఎంచుకోవడం వల్ల కుటుంబాలకు తక్కువ ఖర్చు, తక్కువ విద్యుత్ బిల్లులు లభిస్తాయి. దేశ ప్రగతి కోసం, ఇది తక్కువ వ్యర్థాలు, వనరుల సమర్థవంతమైన వినియోగం, స్థిరమైన జీవన విధానం వైపు దృఢమైన అడుగు అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.



జాతీయ సమాచారహక్కు పరిరక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కో-కన్వీనర్
గాడి పెల్లి మధు గౌడ్

# నూతన డ్రైనేజీ నిర్మాణ పనులు

**వరంగల్ వాయిస్, పరకాల :** భారీ వర్షాల కారణంగా రోడ్లపైకి వరద నీరు రాకుండా, ముంపు ప్రాంతాలలో వరద సమస్యను నివారించేందుకు పరకాల పట్టణంలో చేపట్టిన నూతన డ్రైనేజీల నిర్మాణం పనులను స్థానిక మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ శుక్రవారం ఉదయం పర్యవేక్షించారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్న తీరును, పూర్తయిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ మాట్లాడుతూ పరకాల పట్టణ ప్రజల సౌకర్యం కోసం, వరద సమస్య శాశ్వత పరిష్కారం కోసం టీయూఎఫ్ఐడీసీ ద్వారా సుమారు రూ. 15 కోట్ల నిధులు మంజూరు చేయించిన స్థానిక శాసన సభ్యులు శ్రీ. రేవూరి ప్రకాష్ రెడ్డికి ఒకటో వార్డు ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.



# 31న ఓటీటీలోకి కొత్తలోక

చిన్న చిత్రంగా విడుదలై రికార్డులు తిరగరాసింది 'కొత్తలోక: చాప్టర్ 1' కేవలం మౌత్ టాక్‌తోనే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించింది సినిమా. ఈ మూవీ ఎప్పుడెప్పుడు ఓటీటీలోకి వస్తుందా? అని అభిమానులు ఎదురుచూశారు. తాజాగా వారి ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పెడుతూ జియో హాట్‌స్టార్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. అక్టోబర్ 31 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు తెలిపింది. తెలుగు, మలయాళం, తమిళ, హిందీతో పాటు బెంగాళీ, మరాఠీలలోనూ ఇది స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుపుతూ ఓ పోస్టర్ విడుదల చేసింది. చంద్ర అలియాస్ నీలి (కల్యాణి ప్రియదర్శన్) అతీంద్రియ శక్తులు కలిగి ఉంటుంది. ఒక మిషన్‌లో ఆమె త్రుటిలో శత్రువుల నుంచి తప్పించుకుంటుంది. దీంతో చంద్ర స్వీడన్ నుంచి బెంగళూరుకు షిఫ్ట్ అయ్యి తన గురించి ఎవరికీ తెలియకుండా ఒక కేఫ్‌లో పనిచేస్తూ ఉంటుంది. ఆమె పక్కింట్లో ఉండే సన్నీ (నస్లేన్) ఆమెతో స్నేహం పెంచుకుంటాడు. మరోవైపు ఇన్‌స్పెక్టర్ నాచియప్ప గౌడ (శాండి మాస్టర్), అతడి బాస్ మానవ అవయవాల అక్రమ రవాణా చేస్తుంటారు. అనుకోకుండా తారసపడిన చంద్రపై నాచియప్పకు అనుమానం కలుగుతుంది. మరి ఆ తర్వాత అతడు ఏం చేశాడు? అసలు చంద్ర ఎవరు..? ఆమెను చూసి సన్నీ ఎందుకు అంతగా భయపడ్డాడు? అనేది చిత్ర కథ. ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ రూ.300 కోట్లకు పైగా వసూలు చేసింది. అంతేకాదు, అత్యధిక వసూళ్లు రాబట్టిన తొలి మలయాళీ చిత్రంగానూ రికార్డు సృష్టించింది.

## బాలయ్యతో మలినేని కొత్త మూవీ

**నవంబర్ 7న పూజా కార్యక్రమాలు**

బాలయ్యకు వీరసింహ రెడ్డి వంటి సూపర్ హిట్ సినిమాను అందించిన గోపీచంద్ మలినేనితో మరో సినిమా చేయబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాపై ఇప్పటి నుండి అభిమానుల్లో అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. ఈ పవర్ఫుల్ కాంబోను అత్యంత భారీ బ్జడెట్ పై వృద్ధి సినిమాస్ బ్యానర్ లో సతీష్ కిలారు నిర్మించనున్నారు. ఎన్‌బికె111 టైటిల్ తో తెరకెక్కుస్తున్న ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లేందుకు ముహూర్తం ఫిక్స్ అయింది. నవంబరు 7 తారీఖున ఈ సినిమాను పూజా కార్యక్రమాలతో షూటింగ్ స్టార్ట్ చేయబోతున్నారు. మాస్ యాక్షన్ అంశాలతో పాటు సినిమా రెండు వేరు వేరు కాలాలకు చెందిన హిస్టారికల్ స్టోరీ అని చరిత్రను.. వర్తమానాన్ని ముడిపెడుతూ ఎపిక్ స్టోరీని రెడీ చేసినట్టు తెలుస్తోంది. ఒకరకంగా టైమ్ ట్రావెల్ లాంటి కథలా ఉంటుందని బాలయ్యను మునుపెన్నడు చూడని విధంగా పవర్ఫుల్ గా ఉండబోతుందట అందుకు తగ్గట్టే దర్శకుడు కొన్ని రోజుల క్రితం మొరాకోలో అనౌన్స్‌మెంట్ షూటింగ్ కూడా ఫినిష్ చేసాడు దర్శకుడు గోపీచంద్. ఈ సినిమాకు సీనిమాటోగ్రాఫర్ గా కాంతార కు పని చేసిన అర్విండ్ కశ్యప్ ను తీసుకున్నారు. ఇక సంగీత దర్శకుడిగా బాలయ్య ఆస్థాన వాయిద్యుడు తమన్ వర్క్ చేయబోతున్నారు.





## ఎస్ఎస్ఎంబీ29

**మ్యూజిక్ సెషన్ మొదలయ్యిందన్న కాలభైరవ**

ఎస్ఎస్ఎంబి 29 ప్రస్తుతం భారతీయ సినీ ఇండస్ట్రీలో క్రేజీ ప్రాజెక్ట్. మహేశ్‌బాబు కథానాయకుడిగా అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచర్ మూవీ ఇది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న మూవీకి సంబంధించి ఎప్పుడెప్పుడు అప్‌డేట్‌లు వస్తాయా? అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో సంగీత దర్శకుడు కీరవాణి తనయుడు కాల భైరవ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఆయన స్వరాలు సమకూర్చిన 'మోగ్లీ' మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా మహేశ్`రాజమౌళి ప్రాజెక్ట్‌కు సంబంధించి అప్‌డేట్‌ను ఇచ్చారు. ఇటీవల ఈ సినిమాకు సంబంధించి సంగీత కార్యక్రమాలు మొదలైనట్లు తెలిపారు. నాన్నగారి సినిమాల్లో వర్క్ ఉంటే, కచ్చితంగా చెబుతారు. ముఖ్యంగా రికార్డింగ్ సెషన్స్‌కు వెళ్తా. ఎస్ఎస్ఎంబి 29కు సంబంధించి కూడా మ్యూజిక్ పనులు ఇటీవల మొదలయ్యాయి. నేను కూడా అందులో భాగమయ్యా అని అన్నారు. దీంతో మహేశ్ అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ మూవీకి సంబంధించి అసలైన అప్‌డేట్ నవంబరులో రానుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. టైటిల్‌ను వెల్లడిరచడంతో పాటు, ఓ వీడియోను కూడా విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పనులను కూడా పూర్తి చేశారట. హైదరాబాద్ వేదికగా ప్రెస్‌మీట్ లేదా ఈవెంట్‌ను నిర్వహించి వీడియోను విడుదల చేయనున్నారు.



## శ్రీలంకలో పెద్ది పాట షూటింగ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన తదుపరి చిత్రం పెద్ది కోసం శ్రీలంకకు బయల్దేరారు. 'ఉప్పెన' ఫేమ్ డైరెక్టర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని అంటుతు న్నాయి. సినిమా షూటింగ్ కోసం హీరో రామ్ చరణ్ మరియు డైరెక్టర్ బుచ్చి బాబు సానా శ్రీలంకకు బయల్దేరారు. సమాచారం ప్రకారం, రేపటి నుండే అక్కడ పెద్ది షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ శ్రీలంక షెడ్యూల్‌లో, టీమ్ పెద్ది కొన్ని కీలకమైన సన్నివేశాలను, ఒక పాటను చిత్రీకరించనుంది. శ్రీలంకలోని అద్భుతమైన లొకేషన్లలో హీరో చరణ్, హీరోయిన్ జాన్వీ కాంబినేషన్లో ఈ పాటను షూట్ చేయడానికి చిత్రబృందం ప్లాన్ చేసింది. శ్రీలంకలో ఈ షూటింగ్ షెడ్యూల్ చురుకుగా పూర్తి చేసిన వెంటనే, ఈ సినిమా నుండి మొదటి సింగిల్‌ను విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. విశేషమేమిటంటే, ఈ మొదటి సింగిల్ పాటలో శ్రీలంకలో చిత్రీకరించిన అద్భుతమైన విజువల్స్‌ను జత చేయనున్నారు. దీంతో, సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

## ఓటీటీలోకి వచ్చేస్తున్న ఇడ్లికొట్టు



ధనుష్ , నిత్యా మేనన్ జంటగా నటించిన చిత్రం 'ఇడ్లీ కొట్టు'. ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా అక్టోబరు 1న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తన వ్యక్తిత్వం కోసం ఉద్యోగాన్ని వదిలి.. తండ్రి వారసత్వంగా ఇడ్లీ కొట్టు నడిపే సాధారణ వ్యక్తి పాత్రలో ధనుష్ కనిపించారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందడం, విజయవంతమైన 'తిరు' తర్వాత ధనుష్, నిత్యామేనన్ కలిసి నటించడంతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అయితే, ఆ స్థాయి వినోదాన్ని మాత్రం అందించలేకపోయింది. ఇప్పుడు ఈ మూవీ ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. అక్టోబరు 29వ తేదీ నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సదరు ఓటీటీ సంస్థ పోస్టర్‌ను పంచుకుంది.

శివ కేశవులు (రాజ్‌కిరణ్) ఇడ్లీ కొట్టు అంటే ఆ ఊళ్లో ఫేమస్. ఎంతో ఇష్టంగా, మనసు పెట్టి చేసే ఆ కొట్లో ఇడ్లీలు ఎంతో రుచికరం. శివ కేశవులు కొడుకే మురళి (ధనుష్). కొత్తతరం కుర్రాడు కదా, తన తండ్రి నడుపుతున్న కొట్టుని కాస్త ఫ్రాంచైజీలా మార్చేసి, అదే పేరుతో ఇతర చోట్ల కూడా హోటల్స్‌ని ఏర్పాటు చేసి డబ్బు సంపాదించాలని ఆశపడతాడు. కానీ, తన చేతులతో చేయని ఇడ్లీలను తన పేరుతో అమ్మడానికి ససేమిరా ఇష్టపడడు శివకేశవులు. దాంతో మురళి ఉన్నతమైన జీవితం అంటూ కన్నవాళ్లని, ఉన్న ఊరుని వదిలి పట్నం బాట పడతాడు. అలా మొదలైన అతని పరుగు బ్యాంకాక్‌కి చేరుతుంది. పనుల్లో పడి కన్నవాళ్లని కూడా పట్టించుకోడు. బ్యాంకాక్‌లోనే తన బిజినెస్‌లో పార్ట్‌నర్ అయిన విష్ణువర్ధన్ (సత్యరాజ్) కూతురు మీరా (షాలిని పాండే)తో పెళ్లి నిశ్చయమవుతుంది. మరికొన్ని రోజుల్లో పెళ్లి అనగా మురళి తండ్రి శివ కేశవులు చనిపోతాడు. తండ్రి చివరి చూపు కోసం వచ్చిన మురళి తిరిగి బ్యాంకాక్ వెళ్లాడా లేదా?శివకేశవులు చనిపోయాక ఆయన ఇడ్లీ కొట్టు ఏమైంది?మురళికీ, కల్యాణి (నిత్య మేనన్)కీ మధ్య సంబంధం ఏమిటి?మీరాతో అతని పెళ్లి జరిగిందా? అన్నది చిత్ర కథ.




# వెచ్చవెచ్చగా.. చలి నుంచి రక్షణగా..

## ఉలెన్ స్వెటర్ మార్కెట్ ప్రారంభించిన నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శీతాకాలంలో వెచ్చని ఉలెన్ స్వెటర్ లు అందిస్తూ మనల్ని చలి నుంచి రక్షించడంలో టిబెటియన్ లు ముందున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ అశోక హోటల్ ఎదురుగా పాత మున్సిపాలిటీ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన టిబెటియన్ ఉలెన్ స్వెటర్ మార్కెట్ ను శుక్రవారం నాయిని రాజేందర్ రెడ్డి మేయర్ గుండు సుధారాణితో కలిసి ప్రారంభించారు. పీసీసీ జనరల్ సెక్రెటరీ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టిబెటియన్ వ్యాపారులు దశాబ్దాలుగా వరంగల్ ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తున్నారని, వారి ఉత్పత్తులు నాణ్యత, నమ్మకం కలగలిపినవిగా ఉన్నాయని అన్నారు. ప్రతి సంవత్సరం శీతాకాలంలో ప్రజలకు నాణ్యత కలిగిన ఉలెన్ దుస్తులను అందిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారన్నారు. టిబెటియన్ ల మాదిరిగానే చిన్న వ్యాపారులు, హస్తకళాకారులను స్థానికులు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. మేయర్ గుండు సుధారాణి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఉలెన్ వస్త్రాల విక్రయాలకు నేపాలీయులు పెట్టింది పేరు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, సంపత్ యాదవ్, బిల్ల రమణా రెడ్డి, గడ్డం కేశవ మూర్తి, పూజారి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. టిబెటియన్లు సిరింగి డోల్కర్, సిరింగ్ డోల్మా, కర్మ గుర్మే, మిగ్మార్ డోల్మా, టెన్ జిన్ బూటి, టెనజిన్ డోన్ సెల్, డోల్కర్, సోనం సి రింగ్, టక్ ట్యూ, లక్మ డోలుమా, చూడక్, పసంగు వాంగుడు ఆహ్వానితులకు స్వాగతం పలికారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# పెండింగ్ ఫైళ్లు క్లియర్ చేయండి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- జిల్లా కలెక్టర్ తో ప్రత్యేక సమావేశం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, ప్రత్యేక ప్రాజెక్టల పురోగతిపై శుక్రవారం జిల్లా కలెక్టర్ సత్య శారదతో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి మంజూరైన పలు స్కీములు, ప్రజాప్రయోజన పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ జిల్లా అభివృద్ధి వేగం మరింత పెంచడానికి కేంద్ర నిధులను సమర్థవంతంగా వినియోగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వెంటనే క్లియర్ చేసి ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. జిల్లాలో రహదారులు, నీటి పారుదల, విద్య, ఆరోగ్య విభాగాల్లో ప్రాధాన్యం ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు కేటాయించేలా ప్రయత్నాలు చేస్తానని ఎంపీ కడియం కావ్య హామీ ఇచ్చారు. వరంగల్ అభివృద్ధి విషయంలో వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో తన గళాన్ని వినిపిస్తానని ఆమె స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు ఆశిస్తున్న అభివృద్ధి దిశగా కృషి చేస్తానన్నారు. వరంగల్‌ను జాతీయ స్థాయిలో ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యం అని కడియం కావ్య ప్రకటించారు.


# పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని పీవీ రంగారావు గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన వనం శ్రీ వర్షిని పీవీ రంగారావు గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఉదయం డార్మెంటరీ రూములో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగప్రవేశం చేసిన పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు. అయితే శ్రీ వర్షిని మృతికి గల కారణాలు తెలియరాలేదు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# శుభ కార్యాలలో చల్లా జ్యోతి



**వరంగల్ వాయిస్, పరకాల :** నడికుడ మండలం రాయపర్తి గ్రామ బీఆర్ఎస్ నాయకులు అల్లె లావణ్య – ఓదెలు ముదిరాజ్ దంపతుల కుమార్తె శ్రావణి – రాకేష్ ల వివాహ మహోత్సవానికి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సతీమణి చల్లా జ్యోతి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పరకాల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఒంటేరు అనిల్ కుమార్ – ప్రతిభ దంపతుల కుమార్తె ఆశ్రుత నూతన వస్త్రఫల పుష్పాలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆశీర్వదించారు.

# గోరక్ష చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

- గోరక్షకుడిపై కాల్పులు జరిపిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గో రక్షణ, గోమాంస నిషేధ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదకు వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 22 న మెడ్చల్ జిల్లా ఘట్కేసర్ వద్ద గోవులను అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకున్న గోరక్షకుడు సోను (ప్రశాంత్)పై ఎంఐఎం గుండాలు తుపాకీతో కాల్పులు జరిపిన ఘటన రాష్ట్రాన్ని కుదిపేసిందన్నారు. గోవులను రక్షించేందుకు కృషి చేస్తున్న కార్యకర్తపై తుపాకీ కాల్పులు జరగడం హిందూ ధర్మంపై, హిందువుల మనోభావాలపై దాడిగా పరిగణిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎంఐఎం గుండాలు, అక్రమ మాంసం రవాణా మాఫియా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. చట్టాన్ని కాపాడాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వమే నేరస్థులను కాపాడుతున్నారని ఆరోపించారు. గోరక్షకుడిపై కాల్పులు చేసిన వ్యక్తి ఓల్డ్ సిటీకి చెందిన ఇబ్రహీం అని తెలిసినా ప్రభుత్వం మౌనం వహిస్తోందన్నారు. ఇది ఎంఐఎం, కాంగ్రెస్ మధ్య ఉన్న రాజకీయ స్నేహబంధానికి నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం గుండాలను ఎలా ప్రోత్సహిస్తుందో, గోరక్షకులపై హింసకు ఎలా వంతపాడుతుందో అనేదానికి నిదర్శనం అన్నారు. వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ రంగం, సాధారణ ప్రజలు అందరూ బెదిరింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఐఎం గుండాలకు లైసెన్స్ ఇచ్చిన పాలన– తెలంగాణను గన్ కల్చర్ రాజ్యంగా మార్చిందన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వమే నేరస్థులను కాపాడుతోందన్నారు. ఈ సందర్భంగా గోరక్షకుడిపై కాల్పులు చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఎంఐఎం గుంపులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర వ్యాప్తంగా గోవులను అక్రమంగా తరలించే మాఫియాపై ప్రత్యేక దళం ఏర్పాటు చేయాలన్నారు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కలెక్టర్ కు వివరించారు. రాబోయే రోజుల్లో ఇటువంటి అక్రమ చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ జరగనివ్వమని మేము హామీ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, జిల్లా నాయకులు అంబాల రాంగోపాల్ గౌడ్, దువ్వ నవీన్, వంచనగిరి రాజ్ కుమార్, జెట్లింగ్ శివప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com